ఆస్తి కోసం తండ్రి హత్య?

- సంపులో ప్రభుత్వ ఉద్యోగి మృతదేహం లభ్యం
- ఇటీవలే భార్య, కుమారుడిపై పోలీసులకు ఫిర్యాదు

వెంకటేశ్వర్లు (ఫైల్)

హైదరాబాద్ సిటీబ్యూరో/బడంగ్‌పేట్, జూన్ 23(నమస్తే తెలంగాణ): హైదరాబాద్‌లోని మీర్‌పేట్.. పేఅండ్ అకౌంట్స్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న వెంకటేశ్వర్లు(59) ఇంట్లోని సంపులో శవమై కనిపించాడు. కాళ్లు, చేతులను తాళ్లతో కట్టిన ఆనవాళ్లు కనిపిస్తున్నాయి. ఇంట్లోనే ఉండే భార్య, కుమారుడు పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు చేయలేదు. పోస్ట్‌మార్టం రిపోర్ట్ రాకముందే పోలీసులు ఆగమేఘాలపై ఇది ఆత్మహత్య అంటూ స్టేట్‌మెంట్లు ఇచ్చారు. విజయవాడలో ఉండే కూతురు వచ్చి, పోలీసులకు ఫిర్యాదు చేయడంతో అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళ్తే మీర్‌పేట్‌లోని సాయిప్రభు హోమ్స్ కాలనీలో నివాసముండే వెంకటేశ్వరరావు (59) పే అంట్ అకౌంట్స్ ఆఫీసర్‌గా పనిచేసేవాడు. ఆయనకు భార్య జయంతి, కొడుకు భరత్‌రాజు, కూతురు ధరణిదేవి ఉన్నారు. ఆయన మరో రెండేండ్ల లోపు రిటైర్డ్ కానున్నారు. కొన్ని నెల ల క్రితం కూతురు ఇంటికి వచ్చిన సందర్భంగా ఆస్తి విషయంలో గొడవలు జరిగినట్టు తెలుస్తున్నది. ఈ నేపథ్యంలో తనకు కుటుంబసభ్యులనుంచి ప్రాణహాని ఉం దని, డబ్బు, ఉద్యోగం గురించి వేధింపులు ఎక్కువయ్యాయని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఇంట్లో నిద్రపోయేటప్పుడు కూడా వెంకటేశ్వర్‌రావు దిండు కింద కత్తి పెట్టుకుని పడుకునేవాడని స్థానికులు చెప్తున్నారు. ఇంట్లో ఉండలేక ప్రభు త్వ క్వార్టర్స్‌లోకి మూడు రోజుల్లో షిఫ్ట్ అయ్యేందుకు వెంకటేశ్వర్‌రావు అంతా సిద్ధం చేసుకున్నాడు. ఇంతలో సంపులో శవమై కనిపించడంతో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పోలీసులు హడావుడిగా ఆత్మహత్య అని ప్రకటించడం పైనా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వెంకటేశ్వర్‌రావు ఫిర్యాదుపై విచారిస్తే పరిస్థితి ఇలా జరిగితే కాదంటునారు.

ప్రియుడిపై మోజులో.. పెండ్లయిన నెలకే భర్త హత్య!

- గద్వాల జిల్లాలో 'మేఘాలయ తరహా' కిరాతక కిరాయిహత్య
- లవర్‌తో నెలలో 2వేల సార్లు ఫోన్
- గద్వాలలో యువకుడు మిస్సింగ్, కర్నూల్‌లో మృతదేహం లభ్యం
- తల్లీకూతుళ్లు అరెస్ట్, ప్రియుడు పరారీ, విచారణలో పలు నిజాలు

తేజేశ్వర్, ఐశ్వర్య పెండ్లినాటి ఫొటో

గద్వాల అర్బన్, జూన్ 22: 'ప్రియుడితో కలిసి భర్తను చంపిన భార్య', 'హనీమూన్‌కు తీసుకెళ్లి లవర్‌తో కలిసి భర్తను మర్డర్ చేయించిన నవవధువు'... ఈ మధ్యకాలంలో వార్తల్లో నిలుస్తున్న ఈ తరహా ఘటనలు పెరుగుతున్నాయి. ఇటీవల మధ్యప్రదేశ్‌కు చెందిన రాజా రఘువంశీ, సోనమ్ దంపతులు హనీమూన్ కోసం మేఘాలయ వెళ్లగా.. అక్కడే ప్రి యుడితో భర్తను చంపించిన సంచలన ఘటన యావత్ దేశాన్ని నివ్వెరపర్చింది. ఇప్పుడు అలాంటి ఘటననే గద్వాల జిల్లాలో జరిగింది. ప్రియుడు, తల్లితో కలిసి భర్తను చంపించిన భార్య ఉదంతంలో పోలీసులు కేసు నమోదు చేశారు. హంతకులను, తల్లీకూతుళ్లను అరెస్ట్ చేశారు. ప్రియుడు పరారీలో ఉన్నట్టు తెలిపారు. పోలీసులవర్గాల విశ్వసనీయ సమాచారం ప్రకారం జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని గంటరేగికి చెందిన తేజేశ్వర్ (32) ప్రైవేటు సర్వేయర్‌గా పనిచేసేవాడు. అతడికి ఏపీలోని కర్నూల్ జిల్లాకు చెందిన ఐశ్వర్యతో ఫిబ్రవరి 13న పెండ్లి నిశ్చయమైంది. మే 18న పెండ్లి జరగాల్సి ఉండగా ఐదు రోజుల ముందు ఐశ్వర్య కనిపించకుండాపోయింది. ఈ విషయపై యువతిని తేజేశ్వర్‌ను ప్రశ్నించగా కట్నం డబ్బుల కోసం తన తల్లి పడుతున్న ఇబ్బందులు చూడలేక బాధతో స్నేహితురాలి ఇంటికి వెళ్లినట్టు చెప్పింది. దీంతో తల్లిదండ్రులను ఒప్పించిన తేజేశ్వర్ ముందే నిశ్చయించిన ప్రకారం మే 18న ఐశ్వర్యను పెళ్లి చేసుకున్నాడు.

అసలేమైందంటే!

కర్నూల్ జిల్లా కల్లూరు ఎస్టేట్‌కు చెందిన సుజాత.. ఓ బ్యాంకులో స్వీపర్‌గా పనిచేస్తున్నది. ఆమెకు బ్యాంకు మేనేజర్ తిరుమల్‌రావుతో వివాహేతర సంబంధం ఉంది. సుజాత కూతురు ఐశ్వర్యతోనూ తిరుమల్‌రావు సంబంధం పెట్టుకున్నాడు. ఐశ్వర్యను రెండో పెళ్లి చేసుకోవాలని అనుకున్నాడు. కానీ తిరుమల్‌రావు భార్య ఒప్పుకోలేదు. దీంతో తేజేశ్వర్‌ను పెళ్లి చేసుకున్న ఐశ్వర్య... పెండ్లయిన తర్వాత కూడా తిరుమల్‌రావుతో నెలలోపే 2000 సార్లు ఫోన్‌లో మాట్లాడినట్టు పోలీసులు గుర్తించారు. తేజేశ్వర్‌ను హత్య చేయాలన్న ఐశ్వర్య నిర్ణయించుకుందని, ఈ విషయాన్ని తల్లి సుజాతతో చెప్పగా, ఆమె తిరుమల్‌రావు దృష్టికి తీసుకెళ్లింది. ఈక్రమంలోనే సుపారీ ఇచ్చిమరీ.. తేజేశ్వర్‌ను హత్య చేయించి కర్నూల్ జిల్లాలోని పిన్నాపురం చెరువులో పడేశారు. హత్యకు పాల్పడిన ముగ్గురితోపాటు ఐశ్వర్య ఆమె తల్లి సుజాతను అరెస్టు చేయగా, తిరుమల్‌రావు పరారీలో ఉన్నాడు.

క్షణికావేశంలో ఒకరి తర్వాత ఒకరు..

- భార్య ఆత్మహత్య.. తట్టుకోలేక భర్త..
- ములుగు జిల్లా శివతండాలో విషాదం
- పంచాయతీలో న్యాయం జరగలేదని మనస్తాపం

సభావత్ పంతులు

మల్లంపల్లి, జూన్ 23 : క్షణికావేశంలో వృద్ధురాలు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకోగా, తట్టుకోలేక ఆమె భర్త సైతం అదే పురుగుల మందు తాగి బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ విషాదకర ఘటన ములుగు జిల్లాలో కలకలం రేపింది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. మల్లంపల్లి మండలం శివతండాకు చెందిన సభావత్ పంతులు (70), సుగుణ(60) దంపతులు. ఐదు నెలల క్రితం పెద్ద కుమారుడు క్యాన్సర్‌తో చనిపోయాడు. నాలుగేండ్ల క్రితం చిన్న కుమారుడు మనస్తాపంతో ఆత్మహత్య చేసుకున్నాడు. ఇటీవల గ్రామంలో వృద్ధ దంపతుల పెద్ద కోడలితో పాటు ఇంటి పక్కన ఉన్న దాయాదులకు ఇందిరమ్మ ఇల్లు మంజూరైంది. తాము కట్టుకునే ఇంటికి 10 ఫీట్ల దారి కావాలని, ఇందుకోసం డబ్బులిస్తామని ఒత్తిడి చేయడంతో వృద్ధ దంపతులు నిరాకరించారు. ఈ విషయంలో కొంత గొడవ జరగ్గా ఇంటి ఎదురుగా ఉన్న మరో వ్యక్తి తరచూ తమనే తిడుతున్నాడనే భావనతో సోమవారం ఊర్లో పెద్ద మనుషుల సమక్షంలో పంచాయితీకి పిలిపించగా వారు మందలించారు. భూమి విషయంలో నాలుగు రోజులుగా దాయాదులతో జరుగుతున్న గొడవకు తోడు ఇంటి ఎదురుగా ఉన్న వ్యక్తి పంచాయితీ పెట్టించాడని, తమకు న్యాయం జరగడం లేదని, తమ బాధను అర్థం చేసుకునే వారు లేరని వృద్ధ దంపతులు తీవ్ర మనస్తాపం చెందారు. అనంతరం ఇంటికి వెళ్లి సుగుణ పురుగుల మందు తాగి పడిపోగా, అది చూసిన భర్త సభావత్ పంతులు సైతం అదే పురుగుల మందు తాగి పడిపోయాడు. గ్రామస్థులు వెళ్లి చూసే సరికే ఇద్దరు వృద్ధులు చనిపోయి ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ములుగు ఎస్సై వెంకటేశ్వరరావు తెలిపారు.

కాంగ్రెస్ లీడర్లను నమ్ముతలేరు: మైనంపల్లి

మేడ్చల్, జూన్ 23 (నమస్తే తెలంగాణ): పబ్లిక్ ఇంకా కాంగ్రెస్‌ను నమ్ముతలేరు.. పార్టీలో సిస్టం లేదు.. పార్టీ కుప్ప అయిపోతది' అంటూ కాంగ్రెస్ నాయకుడు, మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు చేసిన వ్యాఖ్యలు సోషల్‌మీడియాలో వైరల్ అవుతున్నాయి. నిజామాబాద్ జిల్లాలోని గెస్ట్‌హౌస్‌లో రెండు రోజుల క్రితం మైనంపల్లి తన అనుచరులతో మాట్లాడిన మాటాలు సోషల్‌మీడియాలో చెక్కర్లు కొడుతున్నాయి. 'పార్టీ ఇంకా పికప్ అయితలేదు.. నాకు పర్సనల్ ఏమీలేదు.. మీరు గెలవాలే.. అందరూ మంచింగుండలే.. నేను నా కొడుకు లెటర్ ఇచ్చినట్టయితే సర్సారెడ్డినే ముందర్న తిడుతా.. చక్రధర్‌గౌడ్‌కు లెటర్ ఎట్లా ఇస్తరు? నిన్న మెన్న వచ్చిండు..' అంటూ ఆయన చేసిన వ్యాఖ్యలు సోషల్‌మీడియాలో వైరల్ కావడంతో మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీలో చర్చనీయాంశంగా మారింది.

నేడు రైతు భరోసా విజయోత్సవ సభ: భట్టి, తుమ్మల

హైదరాబాద్, జూన్ 23 (నమస్తే తెలంగాణ): రైతు భరోసా విజయోత్సవ సంబురాలను సచివాలయ ప్రాంగణంతోపాటు రాష్ట్రవ్యాప్తంగా అన్ని మండలకేంద్రాల్లో ఘనంగా నిర్వహించాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు కాంగ్రెస్ కార్యకర్తలకు సూచించారు. ఈ నెల 16 నుంచి 24 వరకు తొమ్మిది రోజుల్లో రూ.9 వేల కోట్ల రైతు భరోసా నిధులను అన్నదాతల ఖాతాల్లో జమ చేస్తున్నట్టు చెప్పారు. కోటి 49 లక్షల 39 వేల 111 ఎకరాలకు రైతు భరోసా ఇస్తున్నట్టు పేర్కొన్నారు. సోమవారం గాంధీభవన్‌లో పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, ఏఐసీసీ కార్యదర్శి చల్లా వంశీచంద్‌రెడ్డితో కలిసి భట్టి మీడియాతో మాట్లాడారు.

ఎక్సైజ్‌శాఖలో పది రోజుల్లో బదిలీలు: జూపల్లి

హైదరాబాద్, జూన్ 23 (నమస్తే తెలంగాణ): ఆబ్కారీ శాఖలో బదిలీలను 10 రోజుల్లోగా చేపట్టాలని మంత్రి జూపల్లి కృష్ణారావు అధికారులను ఆదేశించారు. సోమవారం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర విభజనకు ముందు ఎక్సైజ్ శాఖ ఆదాయం దాదాపు రూ.10వేల కోట్లు ఉండేదని, 2024-25 నాటికి ఈ ఆదాయం రూ.42వేల కోట్లకు చేరిందని చెప్పారు. ప్రతి 100 రోజులకు ఒకసారి ఎక్సైజ్‌శాఖలో అపరిష్కృతంగా ఉన్న సమస్యల గురించి చర్చించి పరిష్కరిస్తానని పేర్కొన్నారు.

బలహీన వర్గాలను వంచించిన కాంగ్రెస్: కిషన్‌రెడ్డి

హైదరాబాద్, జూన్ 23 (నమస్తే తెలంగాణ): బడుగు బలహీన వర్గాలను కాంగ్రెస్ వంచించిందని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి విమర్శించారు. సోమవారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో డాక్టర్ శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. ఆర్టికల్ 370ని రద్దు, కశ్మీర్‌ను భారత్‌లో అంతర్భాగం చేయాలని ముఖర్జీ ఉద్యమాన్ని చేపట్టారని గుర్తు చేశారు.

రెండు నెలల్లోనే 70% 'ఉపాధి' పూర్తి: మంత్రి సీతక్క

హైదరాబాద్, జూన్ 23 (నమస్తే తెలంగాణ): రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం కేటాయించిన 6.50 కోట్ల పనిదినాల్లో.. ఇప్పటికే 4.53 కోట్ల పనిదినాలు పూర్తిచేసినట్టు పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి సీతక్క సోమవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. కేటాయించిన మొత్తం పనిదినాల్లో 70 శాతం లక్ష్యాన్ని రెండు నెలల్లోనే చేరుకున్నట్టు తెలిపారు. సగటున ఒక్కో కూలీకి రోజువారి వేతనం రూ.250.75 లభిస్తున్నదని, రూ.307 దక్కేలా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.

ఆరు గ్యారెంటీలపై చర్చ ఏదీ: ఏలేటి మహేశ్వర్‌రెడ్డి

హైదరాబాద్, జూన్ 23 (నమస్తే తెలంగాణ): ఆరు గ్యారెంటీలపై క్యాబినెట్ సమావేశంలో ఎందుకు చర్చించడంలేదని బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ప్రశ్నించారు. సోమవారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. హామీల అమలుకు స్పష్టమైన ప్రణాళిక ఎందుకు రూపొందించడంలేదని నిలదీశారు.

విత్తన రైతులకు పరిహారం ఇవ్వాల్సిందే: కోదండరెడ్డి

హైదరాబాద్, జూన్ 23 (నమస్తే తెలంగాణ) : జోగులాంబ-గద్వాల జిల్లాలో పత్తి విత్తనోత్పత్తి రైతులకు వెంటనే నష్టపరిహారం చెల్లించాలని రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి సీడ్ కంపెనీలను ఆదేశించారు. సోమవారం రైతు కమిషన్ కార్యాలయంలో సీడ్ కంపెనీల ప్రతినిధులతో సమావేశమైంది. కోదండరెడ్డి మాట్లాడుతూ.. సీడ్ కంపెనీలు ఇష్టానుసారం వ్యవహరించకుండా రైతుల కోణంలో ఆలోచన చేయాలని సూచించారు.

గొర్రెలతో గాంధీభవన్ ముట్టడి

- యాదవ హక్కుల పోరాట సమితి వినూత్న నిసరన
- కాంగ్రెస్ హామీలపై నిలదీసిన గొల్ల, కురుమలు సంఘాల నేతలు
- మంత్రివర్గంలో తప్పనిసరిగా అవకాశమివ్వాలని డిమాండ్
- మ్యానిఫెస్టోను ఎందుకు అమలు చేయడం లేదని మండిపాటు

తమ సామాజిక వర్గానికి మంత్రి పదవి ఇవ్వాలంటూ గాంధీభవన్‌లో గొర్రెలతో నిరసన తెలుపుతున్న గొర్రెల కాపరుల సంక్షేమ సంఘం నాయకులు

హైదరాబాద్, జూన్ 23 (నమస్తేతెలంగాణ)/ సుల్తాన్‌బజార్, జూన్ 23 : గొల్ల, కురుమల సామాజిక వర్గ శాసనసభ్యులకు క్యాబినెట్ పదవులు ఇవ్వాలని, కాంగ్రెస్ ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ జాతీయ యాదవ హక్కుల పోరాట సమితి వినూత్న పద్ధతిలో నిరసన తెలిపింది. పోరాట సమితి ఆధ్వర్యంలో గొల్ల, కురుమలు సోమవారం ఉదయం గాంధీభవన్‌లో డీసీఎంలో గొర్రెలను తీసుకొచ్చి ఆందోళనకు దిగారు. ప్లకార్డులు పట్టుకుని కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్దపెట్టున నినాదాలు చేశారు. ఇక్కడ సమితి అధ్యక్షుడు మేకల రాములు యాదవ్ మాట్లాడుతూ గొల్ల, కురుమల సామాజిక ఎమ్మెల్యేలకు వెంటనే మంత్రివర్గంలో అవకాశం కల్పించాలని, రూ.10 వేల కోట్లతో యాదవ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని, బీఆర్ఎస్ హయాంలో ప్రారంభించిన గొర్రెల పంపిణీ కార్యక్రమాన్ని తిరిగి కొనసాగించాలని డిమాండ్ చేశారు. గొర్రెల పెంపకానికి ప్రత్యక్ష ప్రయోజన బదిలీ పథకం ద్వారా రూ.2 లక్షలు ఇస్తామని మ్యానిఫెస్టోలో కాంగ్రెస్ హామీ ఇచ్చిందని గుర్తుచేశారు. అధికారంలోకి వచ్చి 18 నెలలు గడుస్తున్నా హామీలను అమలు చేయడంలో విఫలమైందని మండిపడ్డారు. గొల్ల, కురుమల సంక్షేమాన్ని కాంగ్రెస్ పూర్తిగా విస్మరించిందని విమర్శించారు. గొల్ల, కురుమలను మంత్రివర్గంలో స్థానం కల్పించకపోవడం తమ సామాజిక వర్గానికి అగౌరవంగా భావిస్తున్నట్టు తెలంగాణ గొర్రెల కాపరుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పోచబోయిన శ్రీహరి యాదవ్, ప్రధాన కార్యదర్శి మారం తిరుపతి యాదవ్ ఆగ్రహం వ్యక్తంచేశారు. 50 ఏండ్లు నిండిన ప్రతి గొర్రెల కాపరికి 6 వేల పెన్షన్ అందించాలని, ఎక్స్‌గ్రేషియాను 10 లక్షలకు పెంచాలని, రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 100 కోట్లు ఉన్న ఎన్సీడీసీ రుణాలను వెంటనే మాఫీ చేయాలని, మూగజీవాలకు ఇన్సూరెన్స్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు.

భారీగా ట్రాఫిక్ స్తంభన

గాంధీ భవన్ ప్రాంగణంలో గొర్రెలు తిరుగుతూ, నిరసనకారుల నినాదాలతో పరిస్థితి గందరగోళంగా మారింది. గాంధీభవన్ పరిసరాల్లో భారీగా ట్రాఫిక్ స్తంభించింది. పార్టీ కార్యాలయంలో సమావేశాలకు ఏఐసీసీ రాష్ట్ర ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ హాజరవుతారని తెలిసి సమితి ప్రతినిధులు ఆమెకు వినతి పత్రం అందించాలని భావించారు. కాగా రాకముందే టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్ వచ్చి విషయాన్ని పార్టీ ఇన్‌చార్జి దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. విషయం తెలిసి పోలీసులు రంగంలోకి దిగి గొర్రెలను, ఆందోళన కారులను వాహనాల్లో తరలించారు. నిరసనలో గొర్రెల కాపరుల సంక్షేమ సంఘం నాయకులు అయోధ్య యాదవ్, జీ హరికృష్ణ యాదవ్, ఉప్పరి శ్రీనివాస్ యాదవ్, మేకల వెంకటేశ్ యాదవ్, ఎం నాగరాజు, మేకల శ్రీశైలం యాదవ్, డీ సత్యనారాయణ, రమేశ్ కురుమ, పాక వెంకటేశ్, యాదయ్య, మల్లేశ్ కురుమ, మహేందర్ యాదవ్ పాల్గొన్నారు.

గొల్లకుర్మలకు మంత్రి పదవి ఎందుకియ్యలే?

ప్రభుత్వంపై బీఆర్ఎస్ నాయకుడు దూదిమెట్ల ఫైర్

హైదరాబాద్, జూన్ 23 (నమస్తే తెలంగాణ) : కాంగ్రెస్ ప్రభుత్వంలో గొల్లకుర్మలకు మంత్రి పదవి ఎందుకియ్యలేదని బీఆర్ఎస్ నేత దూదిమెట్ల బాలరాజు ప్రశ్నించారు. సోమవారం ఆయన తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు సామాజిక న్యాయం 7వ గ్యారెంటీ అని చెప్పి.. తీరా అధికారంలోకి వచ్చాక గొల్లకుర్మలను మరిచిందని పేర్కొన్నారు. వారికి రూ.2 లక్షలు అకౌంట్‌లో వేస్తామని చెప్పి విస్మరించిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. గొర్రెలు, మేకలకు ప్రమాదబీమా ఇవ్వడం లేదని, ఈ క్రమంలో గాంధీభవన్ ముట్టడికి వెళ్లిన గొల్లకుర్మలను అరెస్టు చేయడం దుర్మార్గమని ధ్వజమెత్తారు. పీసీసీ చీఫ్ బొమ్మ మహేశ్‌కుమార్‌గౌడ్ కాదని, బిల్లా మహేశ్ కుమార్‌గౌడ్ అని ఎద్దేవా చేశారు.

29న నిజామాబాద్‌కు అమిత్‌షా రాక

వినాయక్‌నగర్, జూన్ 23: కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ఈ నెల 29న నిజామాబాద్‌లో పర్యటించనున్నారు. పసుపుబోర్డు కార్యాలయాన్ని ప్రారంభించడానికి ఆయన వస్తున్నారని ఎంపీ అర్వింద్ తెలిపారు. ప్రస్తుతం తాత్కాలిక భవనంలో కార్యాలయాన్ని ఏర్పాటు చేస్తున్నామని, శాశ్వత భవనం కోసం జడ్పీ కార్యాలయం వెనుక ఉన్న రెండెకరాల స్థలాన్ని కేటాయించాలని కలెక్టర్‌ను కోరినట్టు పేర్కొన్నారు.

జిల్లాల టూర్‌కు మీనాక్షి

హైదరాబాద్, జూన్ 23 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ పార్టీలో నేతల మధ్య చొటుచేసుకుంటున్న వివాదాలపై రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. గాంధీభవన్‌లో సోమవారం జరిగిన సమావేశంలో పలు ఫిర్యాదు వచ్చాయి. ఈక్రమంలోనే ప్రతి నియోజకవర్గంలో ఏం జరుగుతుందని తెలుసుకునేందుకు ఆమె జిల్లాల పర్యటన చేపట్టాలని నిర్ణయించుకున్నట్టు సమాచారం.

బనకచర్లపై పోరాటం చేస్తాం

- తెలంగాణ వాటాకు నష్టం రాకుండా చూస్తాం
- నేడు సచివాలయం వద్ద రైతునేస్తం కార్యక్రమం
- 316 పోస్టుల భర్తీకి గ్రీన్‌సిగ్నల్
- క్యాబినెట్ భేటీ వివరాలు వెల్లడించిన మంత్రి పొంగులేటి

హైదరాబాద్, జూన్ 23 (నమస్తే తెలంగాణ): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్మించతలపెట్టిన బకనచర్ల ప్రాజెక్ట్‌పై పోరాటం చేయాలని రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయించినట్టు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. గోదావరి జలాల్లో తెలంగాణ వాటాకు నష్టం రాకుండా ఎందాకైనా పోరాటం చేయాలని క్యాబినెట్ నిర్ణయించిందని వివరించారు. సోమవారం ఆయన సచివాలయంలో క్యాబినెట్ భేటీ ము గిసిన అనంతరం మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరితో కలిసి మంత్రివర్గం తీసుకున్న నిర్ణయాలను మీడియాకు వెల్లడించారు. బనకచర్లపై క్యాబినెట్‌లో సుదీర్ఘంగా చర్చించామని, తెలంగాణ నీటి వాటాను తెలంగాణకు తెచ్చేందుకు కృతనిశ్చయంతో ముందుకెళ్లాలని తీర్మానించినట్టు చెప్పారు. జూలై మొదటి వారంలో ప్రజాప్రతినిధులకు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చి, కేంద్రం ముందు తాము ఎలాంటి వాదనలు వినిపించామో వెల్లడిస్తామని తెలిపారు. రాష్ట్రానికి దక్కాల్సిన ప్రతి నీటిచుక్క కోసం అన్ని వేదికలపై పోరాటం చేస్తామని చెప్పారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి క్యాబినెట్ నిర్ణయాల అమలుపై సమీక్షిస్తామని వెల్లడించారు. చౌటుప్పల్ నుంచి సంగారెడ్డి వరకు 201 కిలోమీటర్ల ట్రిపుల్ ఆర్ దక్షిణభాగం అలైన్‌మెంట్‌కు క్యాబినెట్ ఆమోదం తెలిపిందని పేర్కొన్నారు. సంగారెడ్డి జిల్లాలోని ఇంద్రేశం, జిన్నారం కొత్త మున్సిపాలిటీల ఏర్పాటుకు మంత్రివర్గం ఆమోదం తెలిపిందని, ఇస్నాపూర్ మున్సిపాలిటీని అప్‌గ్రేడ్ చేయాలని నిర్ణయించినట్టు తెలిపారు. రాష్ట్రంలో కొత్త మున్సిపాలిటీల్లో కమిషనర్లతోపాటు వివిధ విభాగాల్లో 316 పోస్టుల భర్తీకి కూడా క్యాబినెట్ ఆమోదం తెలిపినట్టు పేర్కొన్నారు. మంగళవారం సాయంత్రం 4 గంటలకు సెక్రటేరియట్‌లోని రాజీవ్‌గాంధీ విగ్రహం వద్ద రెండు వేల మందితో 'రైతు నేస్తం' కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు.

క్యాబినెట్ నిర్ణయాలు

- స్పోర్ట్స్ పాలసీకి ఆమోదం. 2036 ఒలింపిక్స్‌లో పతకాల సాధనే లక్ష్యంగా గ్రామ, స్కూల్ స్థాయి నుంచి క్రీడాకారులను గుర్తించి శిక్షణ నివ్వడం. స్పోర్ట్స్ హబ్‌ల ఏర్పాటు.
- ట్రిలియన్ డాలర్ ఎకనామీ లక్ష్యంగా తెలంగాణ రైజింగ్-2047 విజన్ పాలసీ డాక్యుమెంట్‌కు రూపకల్పన. 2025 డిసెంబర్ 9 నుంచి ఈ విజన్ డాక్యుమెంట్ అమలు.
- మహబూబ్‌నగర్‌లోని ఆర్జీయూకేటీలో ఏటా 180 మంది చొప్పున ఆరేండ్లల్లో 1,080 మంది విద్యార్థులకు అడ్మిషన్లు
- శాతవాహన వర్సిటీ ఇంజినీరింగ్ కాలేజీలో కొత్తగా 240 సీట్లతో నాలుగు కోర్సులు, శాతవాహన లా కాలేజీలో 60 సీట్లతో మూడేండ్ల ఎల్ఎల్‌బీ, ఎల్ఎల్ఎం కోర్సులను ప్రవేశపెట్టడం
- పద్మశ్రీ అవార్డు గ్రహీత నోరి దత్తాత్రేయను సలహాదారుగా నియమించడం. ఎంఎన్‌జే దవాఖాన అప్‌గ్రేడేషన్. క్యాన్సర్ నిర్ధారణ కేంద్రాల ఏర్పాటు.

ట్రిపుల్ ఆర్ దక్షిణ భాగం ఎప్పుడో?

- అలైన్‌మెంట్‌కు రాష్ట్ర క్యాబినెట్ ఆమోదం
- కేంద్రం నిర్ణయంపై పలు అనుమానాలు
- కాంగ్రెస్ ప్రభుత్వ పెద్దల తీరుపై తీవ్ర విమర్శలు
- స్వలాభం కోసమేనని ఆరోపణల వెల్లువ

హైదరాబాద్, జూన్ 23 (నమస్తే తెలంగాణ): జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్ఏఐ) ఆధ్వర్యంలో రీజనల్ రింగురోడ్డు(ట్రిపుల్ ఆర్) ఉత్తరభాగం టెండర్లు పిలిచి ఆరు నెలలు దాటినా ఇంతవరకు ఏజెన్సీ ఖరారు కాలేదు. తాజాగా రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన దక్షిణ భాగం అలైన్‌మెంట్‌కు సోమవారం రాష్ట్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది. కానీ దక్షిణ భాగం రాష్ట్ర సర్కారు ఆధ్వర్యంలో చేపడుతారా? కేంద్రం ఆధ్వర్యంలో నిర్మిస్తారా? అనేది సందిగ్ధంగా మారింది. ట్రిపుల్ ఆర్ ఉత్తరభాగం పనులకు ప్రభుత్వం నిరుడు డిసెంబర్ 27న ఎన్‌హెచ్ఏఐ ఆన్‌లైన్ పద్ధతిలో టెండర్లు ఆహ్వానించింది. ఈ ఏడాది ఫిబ్రవరి 14వరకు టెండర్ల దాఖలుకు గడువు విధించింది. పనులను ఐదు ప్యాకేజీలుగా విభజించి టెండర్లు పిలిచింది. ముందుగా రూ.7,104.06 కోట్లతో 161.5 కిలోమీటర్ల మేర నాలుగు లేన్ల యాక్సెస్ కంట్రోల్డ్ గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్‌వే నిర్మించాలని అనుకున్నారు. కానీ ఇటీవల ఆరు లేన్లుగా నిర్మించనున్నట్టు నిర్ణయించారు. ఈపీసీ(ఇంజినీరింగ్, ప్రొక్యూర్‌మెంట్ అండ్ కన్‌స్ట్రక్షన్) పద్ధతిలో ఐదు ప్యాకేజీలుగా చేపట్టనున్న పనులను రెండేండ్లలో పూర్తిచేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు తెలిపారు. తాజాగా రాష్ట్ర ప్రభుత్వం సంగారెడ్డి నుంచి చౌటుప్పల్ వరకు సుమారు 201కిలోమీటర్ల పొడవున ట్రిపుల్ఆర్ దక్షిణ భాగం అలైన్‌మెంట్‌ను రూపొందించగా, సోమవారం క్యాబినెట్ ఆమోదం తెలిపింది. వాస్తవానికి ట్రిపుల్ఆర్‌ను కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోనే నిర్మించాలి. కానీ రాష్ట్ర ప్రభుత్వం సొంత ప్రయోజనాల కోసం దక్షిణ భాగం అలైన్‌మెంట్‌ను సిద్ధం చేసిందని విమర్శలు వస్తున్నాయి. రాష్ట్ర సర్కారు రూపొందించిన దక్షిణ భాగం అలైన్‌మెంట్‌ను కేంద్రం ఏ మేరకు ఆమోదిస్తుందో అని అధికారులే సందేహం వ్యక్తంచేస్తున్నారు. ఇప్పటికే ఉత్తర భాగం భూసేకరణ కొలిక్కిరాలేదు. పలు ప్రాం తాల్లో కోర్టు కేసులు నడుస్తున్నాయి.

రేవంత్ ట్రాప్‌లో క్యాబినెట్